క్లుప్తంగా

భూ భారతి చట్టంపై నేడు అవగాహన సదస్సు

కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై రైతాంగానికి అవగాహన కల్పించడం కోసం కొండమల్లేపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలునాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి పాల్గొంటారని తెలిపారు. మండల ప్రజలు ఈ అవగాహన సమావేశానికి హాజరు కావాలని స్థానిక తహసీల్దార్ అన్వర్‌హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : 33/11 కెవి ఎఫ్‌సీఐ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే హనుమాన్‌పేట ఫీడర్ క్రింద లైన్ వర్క్ నడుస్తున్నందున హనుమాన్ పేట, రెడ్డీకాలనీ, నాగార్జుననగర్, డీమార్ట్, మోడీ ప్రాపర్టీస్, గాయత్రినగర్, ముత్తిరెడ్డికుంట, ఏరియాతో పాటు అశోక్‌నగర్ ఫీడర్‌లోని సంతోష్‌నగర్, వాసవినగర్‌కాలనీలకు గురువారం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో టూటౌన్ ఏఈ ఎన్. రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అడవిదేవులపల్లిలో..

అడవిదేవులపల్లి : సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 17న ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంరాయం ఉంటుందని మండల విద్యుత్ ఏఈ ఎల్ శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. అడవిదేవులపల్లి సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ అడవిదేవులపల్లి 11కేవీ, ముదిమాణిక్యం ఫీడర్ లైన్‌కు తలుగుతున్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అదే విధంగా ఆయా ఫీడర్ల పరిధిలోని రెసిడెన్షియల్, పరిశ్రమలు, పాఠశాలలు, వాణిజ్య వ్యాపారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యుదాఘాతంతో పాడిగేదెలు మృతి

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలో మంగళవారం ఈదురుగాలులు, వర్షానికి ఆ గ్రామ సమీపంలోని కిటీకిలు బావి వద్ద ఎల్‌టీ విద్యుత్ లైన్ తెగిపోవడంతో గ్రామంలో పెద్దింటి శ్రీకాంత్‌కు చెందిన సుమారు రూ.1 60లక్ష విలువ గల రెండు పాడిగెదేలు మృతి చెందినట్లు బాధితుడు శ్రీకాంత్ తెలిపారు. రోజు మాదిరిగానే మేతకు వెళ్లిన ఈ గేదెలు ప్రమాదవశాతు ఎల్‌టీ లేన్ కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఐఐటీ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు

హాలియా : స్పేస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఐటీ ఒలింపియాడ్ పోటీ పరీక్ష స్థానిక వీఎస్ఆర్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ శివర్ల వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ప్రముఖ విద్యావేత్త మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య పర్యవేక్షణలో స్పేస్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఐఐటీ ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి ర్యాంకులు, మెడల్స్‌తో పాటు మెరిట్ సర్టిఫికెట్లను సాధించినా్రని తెలిపారు. ఆ విద్యార్థులను ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి



టీకా వేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ నాగేందర్

త్రిపురారం : రైతులు పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు సకాలంలో వేయించాలని త్రిపురారం మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగేందర్ అన్నారు. బుధవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో త్రిపురారం, నీలాయిగూడెం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 4 ఆవులు, 206 గేదెలకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారులు పేర్కొన్నారు. గురువారం సత్యనారాయణపురంలో టీకాలు వేయనున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశికళ, రామ్‌కోటి, పశు మిత్ర రేణు తదితరులు పాల్గొన్నారు.

మబ్బులు.. రైతుల గుండెల్లో గుబులు

- ఉదయం ఎండలు..సాయంత్రం గాలులు
- ఆయకట్టులో కొనసాగుతున్న వరి కోతలు
- కల్లాల్లోనే ధాన్యం రాశులు
- ఆందోళనలో అన్నదాతలు



హాలియాలో వరి కోస్తున్న యంత్రం



ధాన్యం కుప్ప చేసి పట్టాలు కప్పుతున్న రైతులు

హాలియా : రైతన్నలను వరుణుడు వణుకుపుట్టిస్తున్నాడు. రోజురోజుకు వాతావరణంలో కనిపిస్తున్న మార్పుల కారణంగా ఆకాశం మేఘావృతమై వర్ష సూచన కన్పించడం అన్నదాతలను దడ పుట్టిస్తోంది. తీరా పంట చేతికొచ్చే దశలో వర్షం కుమ్మరిస్తే పంట ఆగం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగర్ నియోజకవర్గంలోని ఆయకట్టు ప్రాంతాల్లో చాలా చోట్ల ముమ్మరంగా వరి కోతలు కొనసాగుతున్నాయి. గాలి దుమారం, అకాల వర్షం భయంతో పచ్చిమీదనే రైతులు పంటను కోస్తున్నారు. పంట కోసిన కొందరు రైతులు ధాన్యాన్ని ట్రాక్కుల్లో తరలించి పొలాల్లోని ఎత్తైన ప్రదేశాల్లో, కల్లాల్లో, బహిరంగ ప్రాంతాల్లో ఆరబెట్టు కుంటున్నారు. ఆకాశంలో మబ్బులు పట్టిన సమయంలో ధాన్యాన్ని రాశులుగా చేసుకుని పట్టాలు కప్పుకుంటున్నారు. తిరిగి ఎండ రాగానే మళ్లీ ఆరబెట్టుకుంటున్నారు. ఈ నేపద్యంలో ఆకాశంలో పడుతున్న మబ్బులు రైతుల గుండెల్లో గుబులురేపుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందకుండా పోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వాతావరణ మార్పులు..

ఎండకాలంలో వాతావరణం గతితప్పిందా అన్నట్టుగా..పరిస్థితులు మారుతున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 38డిగ్రీల ఉష్ణోగ్రతలతో భగ్గున మండిపోతుండగా..సాయంత్ర కాలం వాతావరణం చల్లబడిపోతుంది. దీంతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం ఎండిన తర్వాత మళ్లీ తడుస్తుంది. దీంతో ధాన్యం తక్కువ ధరకు విక్రయించే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

50 శాతం కోతలు పూర్తి..

సాగర్ నియోజకవర్గంలోని ఆయకట్టు, నాన్ ఆయకట్టు పరిధిలో దాదాపు 1.50 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. దీనిలో ఇప్పటి వరకు 40 నుంచి 50 శాతం పంట కోత పూర్తయింది. ఇంకా 75వేల ఎకరాలకు పైగా వరి పంట కోయాల్సి ఉంది. దీంతో ఆకాశంలో మబ్బులు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలు చాలా తక్కువగా ఉండడాన్ని గమనించిన వ్యాపారస్తులు రైతుల వద్ద నుంచి సన్నరకం వరి ధాన్యాన్ని కొనేందుకు తేమ శాతం పేరుతో ధాన్యం ధరను తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సన్నరకానికి ప్రభుత్వ కల్పించిన మద్దతు ధర క్వింటా ధాన్యానికి రూ. 2320లతో పాటు బోనస్ రూ. 500ల ధర ఉండగా మిల్లలర్స్ రూ. 2వేల నుంచి రూ. 2200లకే కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు.

మబ్బులతో ఆందోళనగా ఉంది



ఆకాశంలో వస్తున్న మబ్బులతో ఆందోళన చెందాల్సి వస్తోంది. వాతావరణాన్ని ఆదునుగా చూసుకొని మిల్లర్లు కొర్రీలు పెడుతూ దోపిడీ చేస్తున్నారు. సన్నరకం వరి ధాన్యానికి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర క్వింటాకు రూ. రూ. 2320తో పాటు రూ. 500 బోనస్ ఉండగా మిల్లర్లు క్వింటాకు రూ. 2100 నుంచి రూ. 2200 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. గత్యంతరం లేక అమ్ముకొని నష్టాల బారీన పడుతున్నాం.

– కిలారి సైదులు యాదవ్, రైతు, త్రిపురారం

సమస్యలు పరిష్కరించాలని వినతి



సబ్ కలెక్టర్, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

మిర్యాలగూడ : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అంకెపాక జనార్దన్ అన్నారు. బుధవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలకు ఫీల్డ్ అసిస్టెంట్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంకెపాక జనార్దన్ మాట్లాడుతూ 20ఏళ్లుగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిసెంట్ల సేవలను ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. మూడు నెలలుగా ఫీల్డ్ అసిసెంట్లకు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, ఎఫ్ఏలను ఎఫ్‌టీఈలుగా కన్వర్ట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో చేకూరి మల్లేష్, సైదులు, అంజయ్య, వేముల శ్రీనివాస్, రమణారెడ్డి, గోపాల్, అండాలు, పరమేష్, రాఘవేందర్ పాల్గొన్నారు.

త్రిపురారం : మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో త్రిపురారం మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం (ఐఎన్‌టీయూసీ అనుబంధ) ఆధ్వర్యంలో బుధవారం జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కళమ్మ, లక్ష్మయ్య, సైదులు, ఆంజనేయులు, జానకమ్మ, నేతి వెంకన్న, నాగమణి, లచ్చు, లలిత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

‘వివక్ష’పై ప్రతిఘటన పోరాటాలు

పెద్దవూర: నేటికి గ్రామాల్లో దళితులపై వివక్ష కొనసాగుతుందని, వివక్ష నిర్మూలనకు త్వరలో ప్రతిఘటన పోరాటు నిర్వహించనున్నట్లు కుల వివక్ష పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జునలు అన్నారు. బుధవారం మండలంలోని సంగారం గ్రామంలో కులవివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో కులవివక్షపై సమగ్ర సర్వే నిర్వహించి మాట్లాడారు. నేటికీ గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయంలోకి దళితులను రానివ్వకపోవడం దారుణమన్నారు. రెండు గ్లాసుల విధానం అమలు అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. దళితుల వివక్ష రూపాలపై త్వరలో ప్రతిఘటన పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దొంతాల నాగార్జున, మల్లయ్య, భిక్షమయ్య, రామకృష్ణ, రమేష్, అశోక్, కర్ణాకర్, దయాకర్, శ్రీరాములు, గణేష్, జానయ్య, పద్మ, జయమ్మ, లక్ష్మమ్మ, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణకు రైతులు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణారెడ్డి

చింతపల్లి : పెండ్లి పాకాల ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములు, ఇళ్లు, కోల్పోయే రైతులకు ప్రజలకు పునరావసం కల్పించేందుకు ప్రభుత్వం భూ సేకరణ చేపడుతుందని, రైతులు సహకరించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి కోరారు. బుధవారం మండలం పరిధిలోని నసర్లపల్లిలో సర్వే నంబర్ 287 లో భూ సేకరణ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూ సేకరణకు గ్రామంలోని రైతుల అభిప్రాయలను సేకరిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని రైతులు భూ సేకరణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎమ్మార్వో శర్మ,ఆర్ ఐ సునీత, రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆందోళన



చింతపల్లి : కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

చింతపల్లి : మల్లీశ్వరి ఆతహత్మకు కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మండల కేంద్రంలోని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ముందు బుధవారం ఆ సంఘం నాయకులు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మల్లేశ్వరి చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వింజమూరి కృష్ణయ్య మాట్లాడారు. మల్లీశ్వరి చావు కారణమైన వారిని ఉరి శిక్ష విధించాలని, మల్లేశ్వరి కుటుంబానికి తగిని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నల్ల కాశయ్య, నల్ల ప్రసాద్, వింజమూరు శ్రీకాంత్,సూర్య, ఎంఎస్ఎఫ్ చింతపల్లి మండల అధ్యక్షులు రమేష్, రాజు, వింజమూరు కళ్యాణ్, శివ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరికి నివాళి

నిడమనూరు : మండలంలోని బొకమంతలపాడు గ్రామంలో బుధవారం రాత్రి మల్లేశ్వరీ కుటుంబ సభ్యులు, స్థానికులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని కోరారు. మల్లీశ్వరీ కుటుంబానికి సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్విట్టర్‌లో పిలుపునిచ్చారు. మల్లీశ్వరీ ఆత్మహత్యకు కారణమైన వారికి తగిన శిక్షలు విధించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. బొకమంతలపాడులో నిర్వహించిన ర్యాలీలో మల్లీశ్వరీ సోదరుడు కోటేష్, మాతంగి శాంతికుమార్, జిల్లా రమేష్ మహారాజ్, దుబాస్ కొండలు, శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ సదస్సు కరపత్రం ఆవిష్కరణ



సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ : ఈనెల 20న త్రిపురారం మండల కేంద్రంలో నిర్వహించే సాగర్ నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలో సదస్సు కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రంపై పోరాడాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు కేంద్రం లేబర్ కార్డులు రెన్యువల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న, కాంతారెడ్డి, మెరుగు శ్రీనివాస్, హనుమాతల నరేందర్, బిస్మిల్లా తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మిర్యాలగూడ టౌన్ : చిరుధాన్యాలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



తిరుమలగిరి(నాగార్జున సాగర్) : గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



అడవిదేవుపల్లి : మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ ఏసీడీపీఓ సువర్ణ అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం రెండు, నాలుగు కేంద్రాల్లో పోషణ్ పక్షం నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాలు ఎక్కువగా ఉండే ఆకు కూరలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడి టీచర్లు కళావతి, రమణ, పుష్ప, పాపమ్మ, డాక్టర్ మంజుల, ఏఎన్ఎం విజయ, ఆశా వర్కర్లు నాగమణి, యల్లమ్మ పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండలంలోని ముదిమాణిక్యం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం, ఆరోగ్యం తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రవీణ్, అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, అన్నపూర్ణలతో పాటు ఆయాలు తదితరులున్నారు.

మిర్యాలగూడ టౌన్ : పిల్లలకు మంచి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలాకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని శాంతినగర్ సంతోష్‌నగర్, ఎస్ఎస్‌పీ క్యాంపు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లతిఫా, సుల్తానా, పద్మావతి, లక్ష్మి, రజని, స్వరూప, ఆర్‌పీ సుధా తదితరులున్నారు. అదే విధంగా మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు, విద్యానగర్, ఈదులగూడెం, సోసులదిబ్బలలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యతో పాటు పరిశుభ్రతపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బొందు పార్వతి, నర్మదా, చిన్నమ్మ, తూడి అరుణ, లత, హెల్పర్లు లక్ష్మి, విజయలక్ష్మి, లక్ష్మీకాంతం తదితరులున్నారు. కాలువపల్లి తండాల్లో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి హేమాదేవి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎం. సంతోష, అంగన్‌వాడీ టీచర్లు ఆహ్మది, సైదమ్మ, హెల్పర్లు జంకు, లక్ష్మి, హెల్త్ సిబ్బంది ఫసీమొద్దీన్, ఆశా వర్కర్ బి, శ్రీదేవిలతో పాటు పలువురు గర్భిణులు, బాలింతలు తదితరులున్నారు.

సంఘంలో వారసుల పేర్లు నమోదు చేయాలి



మాట్లాడుతున్న మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు

మిర్యాలగూడ : స్థానిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో వారసుల పేర్లు నమోదు చేయాలని సభ్యులు చింతకాయల సైదులు, నక్క సైదులు, కేసరి వీరప్రసాద్, దుండిగాల రామ్‌లు కోరారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మిర్యాలగూడ మత్స్య పారిశ్రామిక సంఘంలో 246 మంది ఉన్నారని, వీరందరూ చేపల వేటకు వెళ్లి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. సంఘంలో కొంతమంది సభ్యులు చనిపోయారని, చనిపోయిన వారి స్థానంలో వారి వారసుల పేర్లు నమోదు చేయాలని తీర్మానం చేసిన కాపీని జిల్లా మత్స్యశాఖ అధికారికి అందజేసినట్లు తెలిపారు. వారసుల పేర్లు నమోదు చేయాలని, మత్స్యశాఖ గుర్తింపు కార్డులు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. కొందరు సభ్యులు వృత్తినైపుణ్యత పరీక్షలు నిర్వహించకుండా అడ్డుకున్నారని, వారసుల పేర్లు నమోదు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో స్కావెంజర్లను నియమించాలి

మిర్యాలగూడ టౌన్ : గిరిజన గురుకులాల్లో సరిపడా స్కావెంజర్లను నియమించాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం వ్యవస్థాపకులు ధీరావత్ రవినాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దామరచర్ల మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకుల బాలికల విద్యాలయంలో కొన్నేళ్లుగా ఒకే ఒక్క స్కావెంజర్‌తో పనిచేయిస్తున్నారన్నారు. 140 మంది విద్యార్థులుండగా బాతురూమ్‌లు, మురుగుదొడ్లు సరిపడా సిబ్బంది లేరన్నారు. అలాగే కనీస మౌలిక వసతులు కూడా ఏర్పాటుచేయలేదన్నారు. ఇప్పటికైనా సరిపడా స్కావెంజర్లను ఏర్పాటు చేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలన్నారు. ఈ విషయంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గిరిజన సంఘం విద్యార్థులను ఏకం చేసి గురుకులాల సమస్యలను పరిష్కరించేంత వరకు ఉద్యమిస్తామన్నారు.

ఇసుక లారీలు పట్టివేత

మిర్యాలగూడ అర్బన్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక లారీలను వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన పట్టణంలోని వై జంక్షన్ వద్ద చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ మోతీరాం తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండల వంగమర్తి గ్రామం నుంచి ఇసుకను నింపుకుని వస్తున్న రెండు లారీలను పట్టణంలోని వై జంక్షన్ వద్ద గుర్తించి అనంతరం వన్‌టౌన్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. అనుమతి పత్రాలను పరిశీలించగా అన్ని పత్రాలు సరిగానే ఉన్నట్లు గుర్తించామని పోలీసులతో మాట్లాడి అనుమతి పత్రాల ఆధారంగా లారీలను విడిచి పెట్టామని పేర్కొన్నారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు ఇవ్వాలి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలో లాటరీ ద్వారా ఎంపిక చేసిన 552 మంది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు వెంటనే ప్రొసీడింగ్ కాపీలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య బుధవారం నల్లగొండ డిప్యూటీ తహసీల్దార్ తబితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు మాసాలుగా అధికారులను ప్రజాప్రతినిధులను కలిసినా పట్టించుకోవడం లేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సాధన కమిటీ కన్వీనర్ అవుట రవీందర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తుమ్మల పద్మ, అద్దంకి నరసింహ, అశోక్ రెడ్డి, ప్రశాంతి, పగిళ్ల శీను, జాన్సన్, వెంకటమ్మ, పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చత్రపతి చౌహాన్ అన్నారు. బుధవారం ఏబీవీపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సినాఫ్సీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాలీసెట్ ఉచిత బోధనా తరగతులను మండల విద్యాశాఖాధికారి బాలునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చత్రపతి చౌహాన్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక స్పృహ, సేవా భావంతో కలగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సురేందర్ రెడ్డి, కరస్పాండెంట్ గిరిధర్‌రెడ్డి, ఏబీవీపీ ఉమ్మడి నల్లగొండ జిల్లా సంఘటన కార్యదర్శి రాపాక సాయి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివ, కీర్తి, నగర కార్యదర్శి మధు మోహన్‌రాజు, ఉపాధ్యక్షులు అభి, సంయుక్త కార్యదర్శి మనోజ్ తదితరులున్నారు.

రోడ్డుపైనే చెత్త.. వెళ్లేదెలా!



సర్కిల్‌తండాలో రోడ్డును ఇరుకుగా మార్చేసిన చెత్తాచెదారం

చందంపేట : పై ఫొటోలో రోడ్డు పక్క చెత్తాచెదారం పేరుకుపోయి కనిపిస్తున్న ఈ దృశ్యం చందంపేట మండలంలోని పాత కంబాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సర్కిల్‌తండలోనిది. రోడ్ల నిర్వాహణ లేకపోవడం, రోడ్డును కమ్మేసేలా చెత్తాచెదారం పోవడంతో రోడ్డంతా చెత్తాచెదారంతోనే దర్శనమిస్తుంది. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే వాహనదారులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు స్పందించి రోడ్డుపై చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బేస్‌మెంట్ లెవల్‌కే పరిమితమా!

- ఆరేళ్లుగా నిలిచిన ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు
- వ్యయం ఎక్కువవుతుందని మధ్యలో వదిలేసిన కాంట్రాక్టర్



బేస్‌మెంట్ లెవల్‌లో నిలిచిన ఎస్సీ కమ్యూనిటీ భవనం

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులోని స్థానిక బీసీ కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ భవనం బేస్‌మెంట్ వరకే నిర్మించి వదిలేశారు. ఈ భవన నిర్మాణానికి గత ప్రభుత్వం 2019లో మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ.25లక్షలతో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆరేళ్లు పూర్తయినప్పటికీ ఇప్పటికీ ఈ భవన నిర్మాణం పూర్తి కాలేదు. భవన నిర్మాణాన్ని టెండర్ ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణ వ్యయం ఎక్కువ అవుతుందని బేస్‌మెంట్ వరకు పూర్తి చేసి వదిలేశాడు. ఈ ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మాణం జరగకముందు పాత భవనంలో సమావేశాలు నిర్వహించుకునే వారు. ఆ పాత భవనాన్ని కూల్చి వేసిన తర్వాత ఎస్సీ కమ్యూనిటీకి చెందిన సభ్యులు సమావేశాల నిర్వాహణ కోసం రూ.25లక్షలతో నూతన భవన నిర్మాణానికి టెండర్లు పిలువగా కాంట్రాక్ట్ దక్కించుకున్న గుత్తేదారు భవన నిర్మాణం పూర్తి చేయకముందే మధ్యలోనే వదిలేశాడు. దీని వల్ల సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి కమ్యూనిటీ భవనం లేకపోవడంతో ఎస్సీ కమ్యూనిటీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవన నిర్మాణం పూర్తి చేయడానికి అంచనా వ్యయం పెరుగుతుండడం వల్ల పాత టెండర్లు రద్దు చేసి కొత్త టెండర్ ద్వారా నూతన కాంట్రాక్టర్‌కు పనులు అప్పజెప్పడం జరుగుతందని అధికారులు అంటున్నారు. ఏదీ ఏమైనప్పటికీ భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. నివాసాల మధ్యన ఈ ఖాళీ స్థలం ఉండడంతో కంపచెట్లు పెరిగిపోయి విషపూరితమైన కీటకాలతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు అంటున్నారు.

కొత్త టెండర్ పిలుస్తాం

స్థానిక బీసీ కాలనీలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ నూతన భవన నిర్మాణం 2019లో శంకుస్థాపన చేశారు. కాని కాంట్రక్టర్ భవన నిర్మాణానికి సంబంధించి అనుమతులు ఆలస్యంగా రావడంతో అంచనా వ్యయం పెరిగింది. దీంతో భవన నిర్మాణాన్ని బేస్‌మెంట్ వరకు కొనసాగించి మధ్యలోనే వదిలేశారు. ఇందుకు సంబంధించి నూతన టెండర్ ద్వారా నూతన కాంట్రాక్టర్‌కు అప్పజెప్పి త్వరితగతిన భవన నిర్మాణం పూర్తయ్యేలా చేయడం జరుగుతుంది.

- జీవన్‌సింగ్, పంచాయతీరాజ్ డీఈ